ఈనాడు
epaper.eenadu.net

# పాతబస్తీ మెట్రో ప్రభావిత ఆస్తుల సంఖ్య కుదింపు

## పనుల వేగవంతానికి హెచ్ఏఎంఎల్ ఎండీ రోజువారీ సమీక్షలు

**ఈనాడు, హైదరాబాద్:** ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు ఏడున్నర కిలోమీటర్ల మెట్రో రైలు మార్గంలో ప్రభావితమయ్యే ఆస్తుల సంఖ్య తగ్గించేలా మార్గాన్ని రూపకల్పన చేశామని హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు లిమిటెడ్ (హెచ్ఏఎంఎల్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ముందనుకున్న ప్రకారం విస్తరణలో 1100 ఆస్తులు ప్రభావితమవుతాయని అంచనా వేసినా... అలైన్‌మెంట్‌లో మార్పులతో వాటి సంఖ్య 900కి తగ్గిందని తెలిపారు. వీటిలో ఇప్పటికే 412 ఆస్తులకు సంబంధించిన అవార్డులు జారీ చేశామని, 380 ఆస్తుల కూల్చివేతలు పూర్తయ్యాయని తెలిపారు. రూ. 360 కోట్ల నష్టపరిహారం చెల్లించామని వెల్లడించారు. ఆస్తుల సేకరణ, పనుల ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో రోజువారీ సమీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. మిగిలిన ఆస్తుల స్వాధీనానికి, త్వరితగతిన కూల్చివేతలు పూర్తిచేసేందుకు కార్యాచరణ రూపొందించినట్లు ఆయన ఆదివారం ప్రకటనలో తెలిపారు.



యుటిలిటీస్ తొలగింపునకు తవ్వకాలు

**25 మీటర్లకో స్తంభం..** మెట్రోరైలు పనులు ప్రారంభించడానికి వీలుగా చర్యలు చేపట్టామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఈ కారిడార్‌లో స్తంభాల కోసం తగిన స్థలాలను గుర్తించి వాటికి మార్కింగ్ చేసే పని మొదలైందన్నారు. రెండు స్తంభాల మధ్య 25 మీటర్లు (82 అడుగులు) దూరం ఉంటుందని తెలిపారు. మెట్రో స్తంభాలు, స్టేషన్లు వచ్చే చోట భూసామర్థ్య పరీక్షల కోసం ఏజెన్సీని నియమించామని తెలిపారు. చారిత్రక, సున్నిత కట్టడాలకు అంతరాయం కలగకుండా స్తంభాలు, స్టేషన్ల స్థానాలను నిర్ణయించేందుకు డీజీపీఎస్ సర్వే నిర్వహించామన్నారు. నిర్మాణ సమయంలో సర్వే సులభంగా జరిగేలా భూమిపై తాత్కాలిక బెంచ్‌మార్క్ స్థానాలను నిర్ణయించినట్లు చెప్పారు.

### ఓవర్‌హెడ్ తొలగించి భూగర్భ కేబుళ్లు

స్తంభాలు, స్టేషన్లు వచ్చే ప్రాంతాల్లో భూగర్భ మురుగునీటి కాలువలు, తాగునీటి పైపులు, వరద నీటి కాలువలు, పైన వేలాడే విద్యుత్తు తీగల వంటి యుటిలిటీస్‌ను తొలగించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ఓవర్‌హెడ్ విద్యుత్తు తీగలను తొలగించి భూగర్భ కేబుళ్లు వేస్తామన్నారు. ఇందుకోసం జలమండలి, టీజీఎస్పీడీసీఎల్ విభాగాల నుంచి అంచనాలు సమర్పించాల్సిందిగా కోరామని తెలిపారు.